BHARATH SAMACHAR DIGITAL

20, నవంబర్ 2026, శుక్రవారం భారత్ సమాచార్

పంట అవశేషాలు కాలిస్తే భూసారం దెబ్బతింటుంది



భారత్ సమాచార్, సిద్దిపేట జిల్లా: వరి పంట కోత తర్వాత పొలాల్లో మిగిలే పంట అవశేషాలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతుల్లో వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ రైతులకు విజ్ఞప్తి చేశారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణానికి నష్టం కలగడంతో పాటు భూమిలోని సహజ పోషకాలు కూడా తగ్గిపోతాయని ఆమె వివరించారు.

వరి గడ్డిని కాల్చడం వల్ల పొలాల్లో ఉండే సేంద్రియ పదార్థాలు, మిత్ర పురుగులు, ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశిస్తాయని తెలిపారు. అంతేకాకుండా అవశేషాలను కాల్చినప్పుడు వెలువడే పొగతో వాయు కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. నేలలో పోషక విలువలు తగ్గిపోవడం వల్ల భవిష్యత్తులో సాగు చేసే పంటల దిగుబడిపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు.

రైతులు వరి గడ్డిని పశువుల మేతగా ఉపయోగించుకోవాలని సూచించారు. పొలాల్లో మిగిలిన పంట అవశేషాలను కలియదున్ని నేలలో కలిసేలా చేయడం ద్వారా భూసారాన్ని మెరుగుపరచుకోవచ్చని తెలిపారు. అలాగే వరి గడ్డితో కంపోస్టు తయారు చేసుకుని సేంద్రియ ఎరువుగా వినియోగించుకోవచ్చని వివరించారు.

పంట అవశేషాలను కాల్చడం వల్ల తాత్కాలికంగా పొలం శుభ్రం అయినప్పటికీ, దీర్ఘకాలంలో నేల ఆరోగ్యానికి నష్టం జరుగుతుందని రైతులు గుర్తించాలని వేల్పుల పూజ కోరారు. ప్రత్యామ్నాయ పద్ధతులను పాటించడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

© 2026 Bharath Samachar